కోనో కార్పస్ చెట్లను కొట్టేస్తున్నారు

- మనుషులకు ప్రమాదమనే కారణంతోనే
- డివైడర్ల మధ్య భారీ సంఖ్యలో చెట్లు
- ప్రత్యామ్నాయ మొక్కలు నాటాలంటున్న ప్రజలు

అమీర్‌పేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కోనో కార్పస్ చెట్లు ప్రమాదకరమని, వీటిని నరికివేయాలని ప్రభుత్వం నిర్ణయ తీసుకుందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేసిన ప్రకటన చర్చనీయాంశంగా మారింది. అయితే వీటిని పూర్తిగా నరికివేయడంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. 2021-22లో నిర్వహించిన హరితహారంలో భాగంగా ఈ రకం మొక్కలను భారీ సంఖ్యలో నాటినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని పూర్తిగా నరికివేయకుండా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. ఈ చెట్లు నీటిని అధికంగా తీసుకుంటున్నాయని, ఈ చెట్ల వేర్లు డ్రైనేజీ పైపులను నాశనం చేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ చెట్లు విడుదల చేసే పుప్పొడి మనుషుల్లో దగ్గు, జలుబు, ఉబ్బసం, శ్వాసకోస వ్యాధులను వ్యాప్తి చేస్తుందంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ మొక్కలను తొలగించి వాటి స్థానంలో ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే మొక్కలు నాటాలని నగరవాసులు కోరుతున్నారు.

బల్కంపేటలో చెట్లను కొట్టేసిన అధికారులు

నగరవాసులకు పచ్చదనంతో పాటు స్వచ్ఛమైన గాలిని అందించాలనే లక్ష్యంతో 2021-22లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎల్లమ్మ ఆలయం నుంచి ఫతేనగర్ ఫ్లై ఓవర్ వరకు ఉన్న డివైడర్ల మధ్య కోనో కార్పస్ చెట్లను నాటారు. నాటిన కొద్ది కాలానికే ఏపుగా పెరిగి


బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలోని డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన కోనో కార్పస్ చెట్లు



ఫతేనగర్ ఫ్లైఓవర్ సమీపంలోని డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను సగం వరకు కొట్టేసిన దృశ్యం

పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. వీటికి వారంలో మూడు సార్లు నీరందించకపోతే వాడిపోతున్నట్లు కనిపిస్తున్నాయి. నీరు పోసిన తర్వాతి రోజు పచ్చగా కనువిందు చేస్తుంటాయి. అయితే ఈ చెట్లు చాలా ప్రమాదకరమని, వీటి ద్వారా పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే వాటిల్లే ప్రమాదం ఉండడంతో జీహెచ్ఎంసీ, అర్బన్ ఫారెస్ట్ అధికారులు మూడు రోజుల క్రితం ఫతేనగర్ ఫ్లై ఓవర్ నుంచి బల్కంపేట మహాప్రస్థానం వరకు ఉన్న చెట్లను కొట్టి వేశారు. మహాప్రస్థానం నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు ఉన్న చెట్లను మాత్రం అలానే ఉంచారు. వీటిని కూడా కట్ చేస్తారా లేదా అలాగే వదిలేస్తారా అనేది వేచిచూడాలి.

పనిచేస్తున్న ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ చేసిన మహిళ అరెస్ట్

పంజాగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో నమ్మకంగా పనిచేస్తూ బంగారు ఆభరణాలు దొంగిలించిన పనిమనిషిని పంజాగుట్ట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన ఏ.మాధవి(38) అమీర్‌పేటలో నివాసం ఉంటున్న ఆర్.వినీత ఇంట్లో పనిచేస్తోంది. వినీత ఈ సంవత్సరం జనవరి 24 కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ వెళ్లి గత నెలలో తిరిగి వచ్చింది. 31న అల్మారా చూడగా అందులో ఉండాల్సిన 59 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆమె పనిమనిషి మాధవిపై అనుమానంతో పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం రాత్రి పనిమనిషి మాధవిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్టు అంగీకరించింది. దీంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


భోజన పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

ఉచిత భోజన పంపిణీ కేంద్రం ప్రారంభం

బేగంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం చాలా గొప్పదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం సనత్‌నగర్‌లోని బీకే గూడ పార్క్ వద్ద శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిత భోజన పంపిణీ, చలివేంద్రాలను తలసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి భోజనం వడ్డించారు. అనంతరం ఆయన కూడా భోజనం చేశారు. గత 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతిరోజూ సుమారు 250 మందికి దాతల సహాయంతో భోజనాన్ని అందిస్తున్న ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పార్థసారధిని ప్రశంసించారు. ఏప్రిల్ 1 నుంచి సుమారు నెల రోజుల పాటు ఈ కేంద్రం పని చేస్తుందని పార్థసారధి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, మాజీ అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్, సభ్యులు సహదేవ్ గౌడ్, కృష్ణదేవ్ గౌడ్, కృష్ణారెడ్డి, జె.ప్రసాద్ శంకర్, రామలింగం, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, బీఆర్ఎస్ నేతలు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో మెరుగైన వైద్యం

- డాక్టర్ నిఖిల్ మాథుర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని రోగులకు మెరుగైన చికిత్స అందించాలని కేర్ ఆస్పత్రుల గ్రూప్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్ అన్నారు. బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో మంగళవారం కేర్ ఆస్పత్రి ఏఐ-పవర్డ్ నాన్ ఇన్వేసివ్ థెరపీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యూరో, మూత్ర, జీర్ణాశయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఏఐ ఆధారిత నాన్ ఇన్వేసివ్ చికిత్సను అందుబాటులో తీసుకువచ్చామన్నారు. జోగో హెల్త్‌తో కలిసి ఈ ప్రక్రియను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. రోగులకు ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా తక్కువ కోతలతో మెరుగైన చికిత్స అందించాల్సిన అవసరం ఉందన్నారు. కోల్పోయిన కండరాల పనితీరును తిరిగి పొందడంలో ఆధునిక సాంకేతికత ఉపయోగపడుతుందన్నారు. ఏఐ ఆధారిత చికిత్సను అందించేందుకు కేర్ ఆస్పత్రితో ఒప్పందం చేసుకోవడం గర్వంగా ఉందని జోగో హెల్త్ సహ వ్యవస్థాపకుడు శివ నాదరాజా అన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ఈ కార్యక్రమంలో బిజు నాయర్, వైద్యులు ఆకాష్ చౌదరి, ఉమేష్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

పంజాగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. కాగా, బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలో బంజారాహిల్స్, గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్ల అధికారుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు ఇలా ఉన్నాయి.

గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్ పరిధిలో..

- డీఈ, గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్, భీమా నాయక్: 9491067488
- ఏడీఈ, సీబీడీ, గ్రీన్‌ల్యాండ్స్, చరణ్ సింగ్: 9440812852
- ఏడీఈ, గ్రీన్‌ల్యాండ్స్ (ఆపరేషన్) కిషోర్‌కుమార్: 9440812841
- ఏఈ, గ్రీన్‌ల్యాండ్స్, లావణ్య: 9440812874
- ఏఈ, ఎస్ఆర్ నగర్, మౌనిక: 9440812866
- ఏఈ, బేగంపేట, సాయికుమార్: 9440812868.
- ఏడీఈ, సనత్‌నగర్ (ఆపరేషన్) వంశీకృష్ణ: 9440812842
- ఏఈ, సనత్‌నగర్, శేఖర్: 9440812861
- ఏఈ, మోతీనగర్, పృధ్వీరాజ్: 9440812867
- ఏఈ, ఎర్రగడ్డ, శివకుమార్: 9440812869
- ఏఈ, బోరబండ, రంజిత్: 7382616092
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ గ్రీన్‌ల్యాండ్స్: 9490619712/040-23431069
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ బేగంపేట : 9490619716/040-23433306
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఎస్ఆర్ నగర్: 9490619714/040-23431156
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ సనత్‌నగర్: 9490619718/040-23431149
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఎర్రగడ్డ: 8333923726/040-23431392
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ మోతీనగర్: 9490619720/040-23431391
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ బోరబండ: 7382199836/040-23431266

బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో..

- డీఈ, బంజారాహిల్స్ డివిజన్: 9440812828
- ఏడీఈ, సీబీడీ, బంజారాహిల్స్: 9440812854
- ఏడీఈ, అమీర్‌పేట్ (ఆపరేషన్): 9440812843
- ఏఈ, ఎస్‌కే నగర్: 9440812859
- ఏఈ, ఎల్లారెడ్డిగూడ: 9440812862
- ఏఈ, యూసుఫ్‌గూడ: 9440812886
- ఏడీఈ, బంజారాహిల్స్ (ఆపరేషన్): 9440812840
- ఏఈ, బంజారాహిల్స్: 9440812860
- ఏఈ, ఫిలింనగర్: 9440812872
- ఏడీఈ, జూబ్లీహిల్స్: 8332947016
- ఏఈ, జూబ్లీహిల్స్: 9440812871
- ఏఈ, మాదాపూర్: 8333956153
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ బంజారాహిల్స్: 9490619700
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ జూబ్లీహిల్స్: 9490619702
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫిలింనగర్: 9490619704
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ మాదాపూర్: 9490619706
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఎల్లారెడ్డిగూడ: 8333923728
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ యూసుఫ్‌గూడ: 9490619708
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ కల్యాణ్‌నగర్: 9490619710


సత్యహరిశ్చంద్ర నాటకంలో కళాకారుల అభినయం

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం

బంజారాహిల్స్ ,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లోని ఫిలింఛాంబర్ రామానాయుడు కళామండపంలో ఉగాది నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. పొత్తూరి వెంకట సుబ్బారావు నేతృత్వంలో జరుగుతున్న ఈ నాటకోత్సవాల్లో మంగళవారం రంగ స్థల కళాకారులు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. హైదరాబాద్ సురభి కళా నాట్యమండలి ఆధ్వర్యంలో నాటకాన్ని ప్రదర్శించారు. హరిశ్చంద్రగా దేవనాథ్ సూరి, చంద్రమతిగా లక్ష్మిశ్రీ, కాలకౌశికగా దర్శి శ్రీనివాసరావు, శిశ్యగా నారాయణరావు నటించగా వీరికి హార్మోనియం సీహెచ్ నాగేశ్వర్‌రావు, డోలక్‌తో రామకృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారులను ఫినిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్ అభినందించారు.

స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో నగర క్రీడాకారుడి సత్తా

- రెండు స్వర్ణాలు, ఒక రజతం కైవసం చేసుకున్న జుహిత్

మారేడుపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తైవాన్ దేశంలోని జుబేర్ నగరంలో మార్చి 26 నుంచి 30 వరకు జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో సికింద్రాబాద్ మారేడుపల్లికి చెందిన క్రీడాకారుడు చలంచర్ల జుహిత్ (17) రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా మారేడుపల్లిలోని తన నివాసంలో జుహిత్ తల్లిదండ్రులు డాక్టర్ సునీల్ కుమార్, సంధ్యారాణి మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. జూనియర్ మెన్స్ కేటగిరీలో క్యాడెట్ విభాగాల్లో సోలో డాన్స్‌కు రజత పతకం, పెయిర్ స్కేటింగ్, పెయిర్ డ్యాన్స్‌లో స్వర్ణ పతకాలు సాధించాడు. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న జుహిత్ తన నాలుగవ ఏట నుంచే స్కేటింగ్‌లో శిక్షణ పొందాడు. 2022లో అహ్మదాబాద్‌లో జరిగిన 36వ నేషనల్ గేమ్స్‌లో పెయిర్ డ్యాన్స్‌లో కాంస్య పతకం సాధించాడు. చైనాలో 2023లో జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సోలో డాన్స్ కేటగిరీలో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశ గౌరవ, ప్రతిష్ఠలను పెంచుతున్న తమ కుమారుడు ప్రపంచ కప్‌ను సాధించాలని జుహిత్ తల్లిదండ్రులు ఆకాంక్షించారు. తమ కుమారుడికి శిక్షణ ఇస్తున్న కోచ్‌లు అనూప్‌కుమార్ యామ, అమర్‌నాగ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


తల్లిదండ్రులతో కలిసి పతకాలను చూపిస్తున్న జుహిత్


ఆలయం వద్ద పొంగుతున్న డ్రైనేజీ

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

ఖైరతాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని శనిశ్వరాలయం వీధిలో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు మురుగు నీటిలోనుంచే వెళ్లాల్సి వస్తుంది. దీంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జలమండలి అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

వేసవి సెలవుల్లో కొత్త అంశాలను నేర్చుకోవాలి

- నటుడు బాబు మోహన్

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నిర్వహించే సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో శిక్షణ తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సినీ నటుడు బాబు మోహన్ సూచించారు. సికింద్రాబాద్ వైఎంసీఏలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వేసవి శిక్షణ శిబిరం కరపత్రాన్ని వైఎంసీఏ అధ్యక్షుడు జయకర్ డేనియల్‌తో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో మొబైల్ ఫోన్లలో గేమ్స్ ఆడటం, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లతో కాలక్షేపం చేయకుండా కొత్త అంశాలను నేర్చుకోవడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జయకర్ డేనియల్ మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపులో స్పోర్ట్స్, గేమ్స్, ఆర్ట్స్, మ్యూజిక్, లైఫ్ స్కిల్స్ లాంటి 24 అంశాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. మరింత సమాచారం కోసం 9177865215 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ కార్యదర్శి లెనార్డ్, ప్రతినిధులు కల్యాణ్, సాల్మన్‌రాజు, రవిబాబు పాల్గొన్నారు.


సమ్మర్ క్యాంపు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బాబు మోహన్ తదితరులు

గౌరవానికి సన్మానం


సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జర్మనీ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందుకున్న తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు చింతల మల్లేశం గౌడ్‌ను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్ తదితరులు

- హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి)


హనుమాన్ చాలీసా కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

కొనసాగుతున్న వసంత నవరాత్రుల వేడుకలు

బేగంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మోడల్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం వసంత నవరాత్రుల ఉత్సవాలు మూడవ రోజు కొనసాగాయి. 80 మంది బాలబాలికలచే తారకనామ సహిత తులసీపూజ, హనుమాన్ చాలీసా చేయించారు. ఈ కార్యక్రమంలో బాల కాండ సమితి సభ్యులు బుచ్చిబాబు, హారిక, పావని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

కవాడిగూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మత ప్రచారకుడు ప్రవీణ్ పగడాల మరణంపై న్యాయ విచారణ జరిపించాలని, రీపోస్టుమార్టం నిర్వహించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రవీణ్ పగడాలను విజయవాడలో కిడ్నాప్ చేసి కిరాతకంగా చంపేసి రాజమహేంద్రవరం సమీపంలో రోడ్డుపక్కన పడేరని ఆరోపించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను మరో మణిపూర్‌లా చేసేందుకు మోదీ సర్కార్ కుట్ర చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే క్రైస్తవ ప్రచారకర్త ప్రవీణ్ పగడాలను హత్య చేసి ప్రమాదంలో చనిపోయాడంటూ కట్టుకథలు చెబుతున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోలి నరేష్, మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు అల్లం సురేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు, పార్టీ నాయకులు చిప్పరి సుబ్బారావు, మద్దెల ప్రవీణ్ కుమార్, సుచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టెక్ మహీంద్ర ఫౌండేషన్ సభ్యులు

నిరుద్యోగులకు మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ

అడ్డగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు అప్నా-టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం తెలిపారు. తుకారాంగేట్‌లో మంగళవారం శిక్షణ కార్యక్రమం పోస్టర్‌ను ఫౌండేషన్ సభ్యులు గోపీ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. 20-27 ఏళ్ల మధ్య వయసు కలిగి బీఎస్సీ, ఎంఎస్సీ, బీ ఫార్మా, ఎం ఫార్మా, బీకామ్, ఎంకామ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి మెడికల్ కోడింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9154990132 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శ్మశానవాటికలోని నల్లానే దిక్కు..!



వారంతా వలస కార్మికులు. వారికి బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని శ్మశానంలో ఉన్న నల్లా నీరే దిక్కు.. ఇక్కడి నల్లా నీటిని బిందెల్లో పట్టుకుని ఇలా మోసుకెళ్తున్నారు.
ఫొటోలు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మానసిక స్థితి సరిగాలేని కానిస్టేబుల్ అదృశ్యం


ధీరజ్ సింగ్

బోరబండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగాలేని సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆస్పత్రి నుంచి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధీరజ్ సింగ్(40) చాంద్రాయణగుట్ట క్యాంపస్‌లో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ (నర్సింగ్ సహాయకుడు)గా పని చేస్తున్నాడు. అతని మానసిక స్థితి సరిగా లేకపోవడంతో గత నెల 24న ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. కాగా సోమవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ధీరజ్ సింగ్ ఆస్పత్రి నుంచి పారిపోయినట్లు బోరబండ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమ్మర్ క్యాంపు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బాబూమోహన్ తదితరులు

వేసవి సెలవుల్లో కొత్త అంశాలను నేర్చుకోవాలి

●నటుడు బాబు మోహన్

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో నిర్వహించే సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో శిక్షణ తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సినీ నటుడు బాబూమోహన్ అన్నారు. సికింద్రాబాద్ వైఎంసీఏలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వేసవి శిక్షణ శిబిరం కరపత్రాన్ని వైఎంసీఏ అధ్యక్షుడు జయకర్ డేనియల్‌తో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబూమోహన్ మాట్లాడుతూ... వేసవి సెలవుల్లో మొబైల్ ఫోన్లలో గేమ్స్ ఆడటం, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లతో కాలక్షేపం చేయకుండా కొత్త అంశాలను నేర్చుకోవడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం జయకర్ డేనియల్ మాట్లాడుతూ... సమ్మర్ క్యాంపులో స్పోర్ట్స్, గేమ్స్, ఆర్ట్స్, మ్యూజిక్, లైఫ్ స్కిల్స్‌లాంటి 24 అంశాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. మరింత సమాచారం కోసం 91778 65215 నెంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎంసీఏ కార్యదర్శి లెనార్డ్, ప్రతినిధులు కళ్యాణ్, సాల్మన్‌రాజు, రవిబాబు పాల్గొన్నారు.



మహిళల నుంచి వినతి పత్రం తీసుకుంటున్న భానుక నర్మద

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

●బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద

తిరుమలగిరి ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంటు బోర్డు పరిధిలోని కాలనీ, బస్తీలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. మంగళవారం వార్డు-7 లోని ఇండియన్ ఎయిర్‌లైన్స్, మలానీ కాలనీ, పద్మనాభ కాలనీల్లో ఆమె పర్యటించారు. కాలనీకి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధికి సంబంధించిన విషయాలపై కాలనీ వాసులతో సమీక్షించారు. డ్రైనేజీ వ్యవస్థతో పాటు తాగునీటి సరఫరా మెరుగు కోసం పైప్‌లైన్లకు మరమ్మతు చేయాలని, రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కాలనీ వాసులు భానుక నర్మదను కోరారు. వెంటనే ఆమె ఇంజనీర్ రాజేశ్వర్‌తో మాట్లాడి ఈ పనులపై ప్రణాళికలను వచ్చే బోర్డు సమావేశం నాటికి సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపి సీనియర్ నాయకుడు భానుక మల్లికార్జున్, కాలనీ అధ్యక్షుడు బాలరాజు, సెక్రటరీ ఎన్ సత్యనారాయణ, ట్రెజరర్, డి.కృష్ణారావు, వెంకటేశ్వర్లు సత్యనారాయణ శర్మ, వార్డు-7 బీజేపీ అధ్యక్షుడు పవన్ కుమార్, మాజీ అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్డును అభివృద్ధి చేయాలని భానుక నర్మదను కొద్ది రోజుల క్రితం 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో బస్తీ బాటలో భాగంగా ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలో మంగళవారం ఆమె పర్యటించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నగేష్‌యాదవ్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

●కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నగేష్ యాదవ్

అడ్డగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నగేష్ యాదవ్ అన్నారు. మంగళవారం అడ్డగుట్ట లోహియానగర్‌లో జరిగిన జై బాబు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రజలకు ఉచిత విద్యుత్, నిరుపేదలకు రేషన్ కార్డులపై సన్నబియ్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కిం దని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ ముదిరాజ్, బద్రీనాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, బాబూరావు, వెంకటరాజు, ప్రభాకర్, మంద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి 'ఎస్ఆర్‌డీ' చేయూత

పద్మారావునగర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట డివిజన్‌లోని బోయిగూడ, జయానగర్‌కు చెందిన డి. దశరథ్, వాణిల కుమార్తె పూజిత (17) మూడేళ్ల వయస్సు నుంచే జువెనైల్ డయాబెటిక్ వ్యాధితో ఇబ్బంది పడుతోంది. వ్యాధి నియంత్రణకు రోజూ మూడు డోసుల ఇన్సులిన్, థైరాక్సిన్ వంటి మందులను వాడుతున్నారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో కుమార్తె చికిత్స తల్లిదండ్రులకు భారంగా మారిదింది. ఇలా ఉండగా, దశరథ్ కొన్నాళ్ల క్రితం నిర్మాణంలో ఉన్న భవనం నుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురికావడంతో ఏ పని చేయడం లేదు. భార్య ఇళ్లలో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. వీరి పరిస్థితి తెలుసుకున్న సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అనే స్వచ్ఛంద సంస్థ (ఎస్ఆర్‌డీ) డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తమ సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇంద్ర భవానీలతో పూజిత ఇంటికి రైస్ బ్యాగ్, నిత్యావసర సరుకులు పంపించారు. పూజిత రోజువారీ చికిత్సకు అవసరమైన ఇన్సులిన్, థైరాయిడ్ వంటి మందులను రెండు రోజుల్లో అందజేస్తామని వారు తెలిపారు.

నిద్రలోనే ఎలక్ట్రీషియన్ మృతి

తిరుమలగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఇంట్లో పడుకున్న ఓ ఎలక్ట్రీషియన్ నిద్రలోనే మృతి చెందాడు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఎస్సై సంధ్య కథనం ప్రకారం.. తిరుమలగిరి విలేజీ ఎస్సీ కాలనీకి చెందిన అల్ఫాన్స్ (55) స్థానికంగా ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ భార్య, కుమారుడితో కలిసి జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యం తాగుతున్నాడు. మంగళవారం పనికి వెళ్లిన అల్ఫాన్స్ మధ్యాహ్నం ఇంటికి వచ్చి చిత్తుగా మద్యం తాగి నిద్రపోయాడు. రాత్రి భోజనం కోసం భార్య, కుమారుడు నిద్ర లేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. అనుమానంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే అతను చనిపోయినట్లు చెప్పారు. కాగా, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఎండలోనే పడిగాపులు !

●నిర్వహణ లేక నిరుపయోగంగా ఏసీ బస్ షెల్టర్లు
●నిలువ నీడ లేక ప్రయాణికుల అవస్థలు
●కేవలం యాడ్ ఏజెన్సీలకు ఆదాయ వనరుగా 'షెల్టర్లు'
●సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా బస్టాప్‌ల వద్ద పరిస్థితి ఇదీ

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 377 బస్సులు.. 2404 ట్రిప్పుల ద్వారా అక్కడి నుంచి నిత్యం సుమారు లక్ష మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. అంత ముఖ్యమైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న బస్టాప్‌ల్లో నిలువ నీడలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో ఆర్భాటంగా ఇక్కడ ఏసీ బస్ షెల్టర్లు నిర్మించినప్పటికీ నిర్వాహణ లేక మూలన పడ్డాయి. రెండు నెలలుగా ఎండలు మండిపోతుండగా, రానున్న మూ డు నెలల్లో తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ బస్టాప్‌లో తాత్కాలికంగా చలువ పందిళ్లైనా ఏర్పాటు చేసి నీడ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అలంకార ప్రాయంగా ఏసీ బస్ షెల్టర్లు

రెండు ప్రముఖ యాడ్ ఏజెన్సీ సంస్థలు ఆరు ఏసీ బస్ షెల్టర్లు నిర్మించి, ప్రయాణికులకు వసతి కల్పిస్తూ ఆ షెల్టర్లపై ప్రచారం చేసుకునేలా జీహెచ్‌ఎంసీతో ఒప్పందం చేసుకున్నాయి. కోవిడ్ ముందు నిర్మించిన ఈ ఏసీ బస్ షెల్టర్లు ఇప్పటి వరకూ వినియోగంలోకి రాలేదు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం ఆరు బయట ఎండలో వేచి ఉండాల్సి వస్తోంది.



ఎండలో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

నిర్వహణపై నిర్లక్ష్యం

ప్రస్తుతం ఈ ఆరు బస్ షెల్టర్లలో ఒకదాంట్లో మొబైల్ యాక్సరీస్ షాపు నడుస్తుండగా, మరొక దానిని ఎయిర్‌పోర్టు బస్సు కౌంటర్ కోసం వినియోగిస్తున్నారు. మిగిలిన నాలుగు బస్ షెల్టర్లు నిర్వహణ లేకపోవడం, ఏసీలు పని చేయపోవడంతో లోపల వేడి, ఉక్కపోత కారణంగా ప్రయాణికులు వాటిలోకి వెళ్లడం లేదు. అయితే, యాడ్ ఏజెన్సీ సంస్థలు మాత్రం వాటిపై ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్‌లు ద్వారా సొమ్ము చేసుకుంటున్నారు.



బస్ షెల్టర్ల పై హోర్డింగ్‌లు

ఎత్తులో బస్ షెల్టర్లు

ప్రయాణికుల సౌకర్యాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఈ బస్ షెల్టర్లను ఎత్తులో నిర్మించారు. దీంతో వాటి లోపలికి వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దివ్యాంగుల కోసం ర్యాంపులు నిర్మించలేదు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల కోసం లో లెవల్‌లో ఫుట్‌బోర్డులు ఏర్పాటు చేయగా, బస్ షెల్టర్లను మాత్రం రెండు ఫీట్ల ఎత్తులో నిర్మించడం గమనార్హం.

ఆర్టీసీకి లాభాలు వస్తున్నా..

మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చాక ఆర్టీసీకి లాభాలు వస్తున్నా కూడా బస్ షెల్టర్ ఏర్పాటుకు అధికారులు ముందుకు రావడం లేదు. గతంలో ఆటోలు, సొంత వాహనాల్లో ప్రయాణించిన మహిళలు 'మహాలక్ష్మి' అమల్లోకి వచ్చాక ఆర్టీసీ బస్సులనే ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. వీరంతా బస్సుల కోసం ఎండలోనే నిలబడే దుస్థితి నెలకొంది.

బస్ షెల్టర్ల వద్ద అక్రమ వ్యాపారాలు

బస్ షెల్టర్ల మధ్య స్థలాన్ని కొందరు ఆక్రమించి వ్యాపారులు చేస్తున్నారు. దీంతో అక్కడ ప్రయాణికులు నిలబడే పరిస్థితి ఉండటం లేదు. అంతేకాకుండా బస్సులను నిలిపేందుకు కూడా బస్సు డ్రైవర్లకు ఇబ్బందిగా మారింది.

సాధారణ షెల్టర్లు ఏర్పాటు చేయాలి



ఏసీ బస్ షెల్టర్లు కాదు.. ముందు సాధారణ షెల్టర్లు ఏర్పాటు చేయాలి. సామాన్య ప్రజలు ప్రయాణించే బస్టాండ్‌ల్లో షెల్టర్లు, తాగునీరు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలి. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడమే కాదు.. బస్టాప్‌లోని షెల్టర్లలో వసతుల ఏర్పాటుపైనా దృష్టి సారించాలి.

-లక్ష్మణ్, ప్రయాణికుడు

తాత్కాలిక షెడ్లు వేయాలి



వేసవి కాలంలో ఎండ నుంచి ఉపశమనం కోసం నీడ కోసం వెతుకుతూ ఉంటాం. అలాంటిది ప్రయాణికులు బస్సు కోసం ఎండలో నిలబడాలంటే చాలా కష్టంగా ఉంటుంది. వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. కావున బస్ స్టాప్‌ల్లో తాత్కాలికంగా షెడ్లు అయినా నిర్మించాలి.

-వీరేష్, ప్రయాణికుడు



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు షీర్‌కుర్మాను అందజేస్తున్న దృశ్యం

తలసానికి శుభాకాంక్షల వెల్లువ

మారేడుపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఉగాది, రంజాన్ పండుగలు వరుసగా రావడంతో మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేట, సనత్‌నగర్, రాంగోపాల్‌పేట డివిజన్లకు చెందిన హిందువులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బన్సీలాల్‌పేటకు చెందిన అబ్బాస్ రంజాన్ సందర్భంగా అందజేసిన షీర్‌కుర్మాను ఎమ్మెల్యే సేవించారు. తనను కలిసిన వారికి ఎమ్మెల్యే తలసాని ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బన్సీలాల్‌పేట కార్పొరేటర్ కుర్మ హేమలత, బన్సీలాల్‌పేటకు చెందిన ముస్లిం నాయకులు రజాక్, అబ్బాస్, జావీద్, షరీఫ్, జహంగీర్, సనత్‌నగర్‌కు చెందిన జమీర్, వసీం, ఇబ్రహీం, బెంగాలీ సమాజ్ ప్రతినిధులు పబ్బా ప్రకాష్, అబ్బుల్, మోహిదుల్, బాపి, నాయకులు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, బలరాం తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి లక్ష్మీ నారాయణ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన జనరల్ బజార్‌లోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం (3వ తేదీ) నుంచి ప్రారంభమవుతాయి. 13వ తేదీ వరకు కొనసాగుతాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి తెలిపిన ప్రకారం.. 3వ తేదీ ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, సాయంత్రం అంకురార్పణ, గరుడ ప్రతిష్ట పూజలు నిర్వహిస్తారు. 4వ తేదీ ఉదయం మండపారాధన. మూల మూర్తుల అభిషేకం, ధ్వజారోహణం తదితరాలు, 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం నిత్యారాధన, నవకలశ తిరుమంజనం, యాగశాల పూజ, హోమం నిర్వహిస్తారు. 6వ తేదీ రాత్రి హనుమంత వాహన సేవ, 7వ తేదీ రాత్రి పల్లకీ సేవ, వట్టికోట యాదగిరాచార్య శిష్య బృందంచే భరతనాట్య నృత్య ప్రదర్శన ఉంటుంది. 8వ తేదీ రాత్రి గరుడ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, 9వ తేదీ రాత్రి గజవాహన సేవ, శ్రీవేదాంత భారతి సౌందర్యలహరి శృంగేరి భక్త బృందంచే రామకథా చరితం, రామనామ సంకీర్తనలు ఉంటాయి. 10వ తేదీ సాయంత్రం యాగశాల పూజ, హోమం, 11వ తేదీ రాత్రి అశ్వవాహన సేవ, దీపోత్సవం, విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమం నిర్వహిస్తారు. 12వ తేదీ రాత్రి రథోత్సవం, 13వ తేదీ ఉదయం అవబృథ స్నపనం, రాత్రి పూర్ణాహుతి సేవ, ధ్వజావరోహణం పూజలు జరుగుతాయి.



లక్ష్మీనారాయణ దేవస్థానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టెక్ మహీంద్ర ఫౌండేషన్ సభ్యులు

నిరుద్యోగులకు మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ

అడ్డగుట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు అప్సా - టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం తెలిపారు. తుకారాంగేట్‌లో మంగళవారం శిక్షణ కార్యక్రమం పోస్టర్‌ను ఫౌండేషన్ సభ్యులు గోపీ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ, 20-27 ఏళ్ల మధ్య వయస్సు కలిగి బీఎస్సీ, ఎంఎస్సీ, బీఫార్మా, ఎంఫార్మా, బీకామ్, ఎంకామ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నం. 9154990132ను సంప్రదించవచ్చన్నారు.

బోయినపల్లి మార్కెట్‌యార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

●చైర్మన్ ఆనంద్‌బాబు

బోయినపల్లి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతి పెద్ద కూరగాయాల మార్కెట్ అయిన బోయినపల్లి మార్కెట్ యార్డులో రైతులు, వ్యాపారులకు వీలైనంత త్వరలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మార్కెట్ యార్డు చైర్మన్ రాగిరు ఆనంద్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మార్కెట్ యార్డులో నెలకొన్న పలు సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆనంద్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ, యార్డులో రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, మూత్రశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మార్కెట్ యార్డులో బహిరంగ మూత్రవిసర్జన చేయకుండా మూడు ప్రాంతాల్లో మూత్రశాలల ఏర్పాటుతో పాటు మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లను నిర్మిస్తున్నామన్నారు. ముఖ్యంగా యా ర్డులో ఎలాంటి అవినీతి, అసాంఘిక కార్యకలపాలకు తావివ్వకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు సెక్యూరిటీని పెంచుతామన్నారు. యార్డులో ట్రాఫిక్ సమస్యలకు కారకులైన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపకుండా డివైడర్లను ఏర్పా ట్లు చేస్తున్నామని చైర్మన్ తెలిపారు. క్యాంటీన్ నిర్వహణకు బహిరంగ టెండర్లు పిలుస్తున్నామని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పాలకమండలి సభ్యులు సాయిశరత్, రాజేందర్, పాషా, రాము తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులోని సమస్యలపై ఆరా తీస్తున్న చైర్మన్ ఆనంద్ బాబు

సీతాఫల్‌మండిలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటు

● ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ కొత్త విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని, మహనీయుల స్ఫూర్తి ప్రజలకు చేరేలా కృషి చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ నాయకుడు జి.చంద్రశేఖర్ నేతృత్వంలో కొత్తకమిటీ సభ్యులు పద్మారావుగౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడితో పాటు నూతన కమిటీ సభ్యులను పద్మారావుగౌడ్ సత్కరించి అభినందించారు. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొత్తకమిటీ పేదల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు గడ్డం ప్రసాద్, చలపతి, గిరి, విద్యాసాగర్, జీవీ కృష్ణ, లలిత, రాజేశ్వరరావు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ ఉద్యమకారులకు తాము అండగా ఉంటామని, వారి సాధక బాధకాల పట్ల ఉద్యమ నాయకుడిగా తనకు పూర్తి అవగాహన ఉందని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన మేరకు ఉద్యమకారులకు 250 గజాల స్థలం, రూ. 25 వేల పెన్షన్‌తో పాటు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 21న నిర్వహించే ప్లీనరీ సమావేశ పోస్టర్‌ను మంగళవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జానకిరెడ్డి, రాంబాబు ముదిరాజ్, దయానంద్ గంగపుత్ర, జగన్‌యాదవ్, ఆర్కే భూపాల్, లక్ష్మణ్, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్, కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

మానసిక స్థితి లేని వ్యక్తి అదృశ్యం

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని జామై మసీద్ ప్రాంతంలో నివాసముంటున్న అబ్దుల్ రషీద్(50)కు కొంత కాలంగా మానసికి స్థితి సరిగా ఉండటంలేదు. అనారోగ్యం కారణంగా చూపు మందగించింది. కాగా, సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన రషీద్ తిరిగి రాలేదు. రంజాన్ పండుగ కావడంతో బంధువుల ఇంటికి వెళ్లి ఉంటాడని కుటుంబసభ్యులు అనుకున్నారు. మంగళవారం ఉదయానికి కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి బంధు,మిత్రులను ఆరా తీశారు. అబ్దుల్ రషీద్ ఆచూకీ తెలియక పోవడంతో బోయిన్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.



అబ్దుల్ రషీద్

స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో నగర క్రీడాకారుడి సత్తా

● రెండు స్వర్ణాలు, ఒక రజతం కైవసం చేసుకున్న జుహిత్

మారేడుపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తైవాన్ దేశంలోని జుబేర్ నగరంలో మార్చి 26 నుంచి 30 వరకు జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో సికింద్రాబాద్ మారేడుపల్లికి చెందిన క్రీడాకారుడు చలంచర్ల జుహిత్ (17) రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా మారేడుపల్లిలోని తన నివాసంలో జుహిత్ తల్లిదండ్రులు డాక్టర్ సునీల్ కుమార్, సంధ్యారాణి మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. జూనియర్ మెన్స్ కేటగిరీలో క్యాడెట్ విభాగాల్లో సోలో డాన్స్‌కు రజత పతకం, పెయిర్ స్కేటింగ్, పెయిర్ డ్యాన్స్‌లో స్వర్ణ పతకాలు సాధించాడు. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న జుహిత్ తన నాలుగవ ఏట నుంచే స్కేటింగ్‌లో శిక్షణ పొందాడు. 2022లో అహ్మదాబాద్‌లో జరిగిన 36వ నేషనల్ గేమ్స్‌లో పెయిర్ డ్యాన్స్‌లో కాంస్య పతకం సాధించాడు. చైనాలో 2023లో జరిగిన ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో సోలో డాన్స్ కేటగిరీలో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశ గౌరవ, ప్రతిష్టలను పెంచుతున్న తమ కుమారుడు ప్రపంచ కప్‌ను సాధించాలని జుహిత్ తల్లిదండ్రులు ఆకాంక్షించారు. తమ కుమారుడికి శిక్షణ ఇస్తున్న కోచ్‌లు అనూప్‌కుమార్ యామ, అమర్‌నాగ్ యామలకు కృతజ్ఞతలు తెలిపారు.



తల్లిదండ్రులతో కలిసి పతకాలను చూపిస్తున్న జుహిత్

ఆస్పత్రి నుంచి కానిస్టేబుల్ మిస్సింగ్

బోరబండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగాలేని సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆస్పత్రి నుంచి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధీరజ్ సింగ్(40) చాంద్రాయణగుట్ట క్యాంపస్‌లో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ (నర్సింగ్ సహాయకుడు)గా పని చేస్తున్నాడు. అతని మానసిక స్థితి సరిగా లేకపోవడంతో గత నెల 24న ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. కాగా సోమవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ధీరజ్ సింగ్ ఆస్పత్రి నుంచి పారిపోయినట్లు బోరబండ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధీరజ్ సింగ్